ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 05.11.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ తేదీ దగ్గరపడుతుండటంతో ప్రధాన పార్టీలన్నీ తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి.

2. రాష్ట్రంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద సౌర విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు

3. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి ఈరోజు పదవీ బాధ్యతలు స్వీకరించారు.

4. కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు. శైవ, వైష్ణవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ తేదీ దగ్గరపడుతుండటంతో ప్రధాన పార్టీలన్నీ తమ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా సీనియర్ నేత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రులు, అధికార పార్టీ నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న రాత్రి రహమత్నగర్లో జరిగిన ప్రచారంలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కాంగ్రెస్ సీనియర్ నేత , మంత్రి జూపల్లి క్రుష్ణారావు ఈ ఉదయం సాయిబాబా నగర్, బోరబండలో పర్యటించారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ప్రచారంలో తమ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మంచి స్పందన లభిస్తోందని చెప్పారు. ఇక , బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు రోడ్డు షోలు , కార్నర్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన అధికార కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎత్తిచూపుతూ విమర్శలు గుప్పిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ సీనియర్ నేత , కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి , ఇతర నేతలు ప్రచారాన్ని చేపట్టారు. కిషన్ రెడ్డి ఈ సాయంత్రం బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలో ప్రచారం చేయనున్నారు.

(డెస్క్)

**కార్తీక పౌర్ణమి**

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు. రాష్ట్రంలోని శైవ , వైష్ణవ క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి , ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు, దీపారాధనలు, సహస్ర దీపార్చన వంటి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ పర్వదినం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రజలందరికీ కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఇంటా కార్తీక దీపకాంతులు వెలుగులు నింపాలని , హరిహరాదుల ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించారు. పవిత్రమైన కార్తీక మాసంలో వెలిగించిన దీపకాంతులు ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ.. రాష్ట్ర ప్రజలందరికీ శాసన సభాపతి గడ్డ ప్రసాద్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

(డెస్క్)

**కార్తీక పౌర్ణమి - జిల్లాలు**

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి శోభ ను సంతరించుకుంది. భారీ సంఖ్యంలో భక్తులు వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రతాలు, బిల్వార్చన, నిజాభిషేకం నిర్వహించారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా శైవ, వైష్ణవ ఆలయాల్లులో తెల్లవారుజాము నుంచే భక్తులు ప్రత్యేక పూజలు చేసి , కార్తీక దీపాలు వెలిగించారు. హుజురాబాద్ మండలం బోర్నపల్లి

గ్రామంలోని స్వయంభూ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. మంచిర్యాల జిల్లా , లక్షెటిపేట మండలం గూడెం గుట్ట రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయం. చెన్నూరు పట్టణంలోని అంబా అగస్తేశ్వర ఆలయాలకు భారీ సంఖ్యలో వచ్చిన భక్తులు దీపాలు వెలిగించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయం శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, అర్చన ఘనంగా నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పార్వతీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు 365 వత్తులతో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి , సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా , వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో వేద పండితులు విశేష కార్యక్రమాలను నిర్వహించారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని సోమశిల , ఉమామహేశ్వరం, పట్టణంలోని మార్కెట్ , రామాలయం శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వరంగల్ జిల్లా హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయంలో భక్తులు సామూహిక దీపాలు వెలిగిస్తున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లోనూ భక్తుల సందడి నెలకొంది.

(పీటీసీ, యాదాద్రి భువనగిరి , భద్రాద్రి కొత్తగూడెం , మంచిర్యాల, కరీంనగర్, మహబూబాబాద్, ఆసిఫాబాద్, సిరిసిల్ల, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల)

**సూర్యఘర్ -కిషన్ రెడ్డి**

తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన మంత్రి 'సూర్య ఘర్ యోజన ' పథకం కింద సౌర విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని , దీని ద్వారా ప్రజలకు విద్యుత్ బిల్లుల భారం నుంచి ఉపశమనం లభిస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో పథకం పురోగతి వివరాలను వెల్లడించారు. ఈ పథకం కింద రాష్ట్రంలో ఇప్పటి వరకు 146 కోట్ల రూపాయలు సబ్సిడీగా విడుదలయ్యాయని , 20 వేలకు పైగా ఇళ్లలో సౌర విద్యుత్ వినియోగం జరుగుతోందని పేర్కొన్నారు. దీని ద్వారా 82 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యం ఏర్పాటైందన్నారు.

(డెస్క్)

**సుదర్శన్ రెడ్డి- పదవీ బాధ్యతలు**

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి ఈ ఉదయం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ , ప్రభుత్వ చీఫ్ విప్ ఆది శ్రీనివాస్, పలువురు ఎమ్మెల్యేలు హాజరై సుదర్శన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. క్యాబినెట్ మంత్రి హోదాలో సహాదారుగా నియమతులైన సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన సంక్షేమ కార్యక్రమాల అమలు , అభివృద్ధి బాధ్యతల విధులను నిర్వహిస్తారు.

(డెస్క్)

**గురునానక్ జయంతి**

సిక్కుల మత గురువు గురునానక్ ప్రకాశ్ జయంతిని ఈరోజు దేశ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు.  ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో భిన్నత్వంలో ఏకత్వమనే అద్భుతమైన స్ఫూర్తికి గురునానక్ నిదర్శనమని ఒక ప్రకటనలో కొనియాడారు.

(డెస్క్)

**నాగర్ కర్నూల్ - ఎమ్మెల్యే**

నాగర్ కర్నూల్ పట్టణంలో నిన్న కురిసిన భారీ వర్షాల కారణంగా తలెత్తిన సమస్యలను తక్షణం పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో చేరిన వర్షపు నీరు,  ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డాక్టర్ రాజేష్ రెడ్డి   ,  ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మున్సిపల్    ,  సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

(పీటీసీ, నాగర్ కర్నూల్)

**సిరిసిల్ల-ఎస్పీ**

ప్రజా సమస్యలపై పోలీసులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బీ గితే పోలీసు అధికారులకు సూచించారు. నిన్న రాత్రి ఎస్పీ ఆకస్మికంగా ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు.

(పీటీసీ, సిరిసిల్ల)

సంగారెడ్డి-కొల్లూరు

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గం    ,  కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ కాలనీలో  స్థానికుల సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించారు. రేషన్

దుకాణాలు,  వైద్య సేవలు బలోపేతం చేయాలని స్థానికులు ఇటీవల కాలనీని సందర్శించిన మంత్రులను పొంగులేటి శ్రీనివాస రెడ్డి  , దామోదర రాజనర్సింహాను కోరారు. దీనిపై స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ నాగ నిర్మల  , బస్తీ దవాఖాన వద్ద నాలుగు అంబులెన్సులను అంబులెన్స్ టెక్నీషియన్లతో సహా అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

(పీటీసీ, సంగారెడ్డి)

నియామకం:

రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి అగ్నివీర్ ఎంపిక కోసం ఈ నెల 10 నుంచి 22 వ తేదీ వరకు హనుమకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ఇండియన్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ జరుగుతుంది. అగ్నివీర్ జనరల్ డ్యూటీ  , అగ్నివీర్ టెక్నికల్ , అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్,  టెక్నికల్ విభాగాల్లో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి అగ్నివీర్ ట్రేడ్స్ మన్ విభాగాలలో వేరువేరుగా అభ్యర్థులను పరీక్షిస్తారు. ఈ ఏడాది మార్చి 12 ర్యాలీ నోటిఫికేషన్ ప్రకారం సబ్జెక్ట్ ర్యాలీకి అడ్మిట్ కార్డులు అందినవారు అన్ని పత్రాలను ర్యాలీ స్థలానికి తీసుకురావాలి. వాటిని www.joinindianarmy.nic.in లో అప్లోడ్ చేయాలి. నియామక ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్  , పారదర్శకంగా జరుగుతుందని , అభ్యర్థులు ఎవరూ దళారీలను , ఏజెంట్లనూ నమ్మవద్దని సైనికాధికారులు విజ్ఞప్తి చేశారు.

(ఎంఎస్ఎల్)

**మహబూబ్ నగర్ - ఎమ్మెల్యే**

మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వెయ్యి కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు జరగనున్నాయని  స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని మహబూబ్ నగర్ పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు      ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ తెలిపారు.

(ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి బైట్)

పిటిసి, మహబూబ్ నగర్

**కరీంనగర్ -శాతవాహన  స్నాతకోత్సవం**

కరీంనగర్ పట్టణ కేంద్రంలోని శాతవాహన విశ్వవిద్యాలయం రెండవ స్నాతకోత్సవం ఎల్లుండి విశ్వవిద్యాలయ మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ఉమేష్ కుమార్ తెలిపారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తో పాటు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉప కులపతి బిజె రావు ముఖ్య అతిథితులుగా హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా 161 స్వర్ణ పతకాలు, 25 మందికి పి హెచ్ డి పట్టాలను గవర్నర్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు ఉమేష్ కుమార్ తెలిపారు.

(సౌండ్ బైట్ ఉపకులపతి ఉమేష్ కుమార్)

పిటిసి, కరీంనగర్

**వాతావరణం**

రాష్ట్రంలో నేడు , రేపు పలు జిల్లాల్లో అక్కడక్కడా వచ్చే తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఖమ్మం ,

నల్గొండ, మహబూబాబాద్, వరంగల్, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మె దక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్, తదితర జిల్లాలకు పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

డెస్క్